# నిజానిజాలతో ముఖాముఖి

రాత్రి తొమ్మిదయింది.

ఏ.సీ. కల్యాణమంటపం. అన్ని హంగులతో ముస్తాబై వుంది. ఒంటినిండా ఆభరణాలు దిగేసుకున్న ప్రౌఢలా నిండుగా కళకళలాడుతోంది. చలువ చేసిన పట్టుచీరెలా ఫెళఫెళలాడుతోంది.

హాలంతా హడావిడిగా వుంది. ఎవరేం మాట్లాడుతున్నారో ఎవరికీ అందటం లేదు. స్పీకర్‌లలో వయొలిన్ రాగ ప్రసారం మంద్రంగా గిరికీలు కొడుతోందిపాట. పచ్చదనాల పరిమళం చల్లదనంలో కలిసిపోయి 'మోయలేని' హాయినిస్తోంది.

పెళ్ళి!

కలవారింటి పెళ్ళి! చంద్రకళ పెళ్ళి. గవర్నమెంట్‌లో పెద్దాఫీసరు శేఖరం గారమ్మాయి. ఏకైక పట్టి! వెంకట్ వరుడు వ్యాపారవేత్త సదానందంగారబ్బాయి. ఏకైక పుత్రుడు! చంద్రకళ సాఫ్ట్‌వేర్‌లో వుంది. వెంకట్ ఐఐటి ఐఐయమ్! హార్ట్‌వేర్‌లో మానవ వనరుల్ని జాగ్రత్త తీసుకుంటున్నాడు.

నేనూ నా పక్కగా విశ్వం. అతని పక్కగా ఫణిరాజ్! శేఖరంగారికి 'అవసరమున్న వేరే డిపార్ట్‌మెంట్ వాళ్లం. చిరుద్యోగులమే అయినా 'మరీ మరీ' చెప్పించుకున్నవాళ్ళం.

హాలునీ, హాల్లో సందడినీ ఆనందిస్తున్నాం.

వేదిక మీద మహారాజు సింహాసనాల్లో వెంకట్, చంద్రకళ, వాళ్ళ పక్కగా వధూవరుల తల్లిదండ్రులూ, అయిన వారూ!

వీడియోలు, కెమేరాలూ బిజీబిజీగా వున్నై.

'దేశంలో డబ్బు ప్రతాపాన్నీ, వీర విహారాన్నీ చూడండిమాష్టారూ' విశ్వం మొదలెట్టాడు. అతను మాటకారి' ఆ ఆడవాళ్ళనీ, వాళ్ళ ఆహార్యాల్నీ చూస్తుంటే మన దేశం బీద దేశమనే వాళ్లని సాచి లెంపకాయ కొట్టాలనిపిస్తుంది'. విశ్వం మాట

కరుకుగా వుంటుంది. ఉచ్చారణలో ఊపూ ఉద్రేకమూ వుంటాయి. అతనింకా నలభైల్లో ఉన్నాడు కూడా!

ఫణిరాజ్ అందుకున్నాడు 'ఇదంతా సాఫ్ట్‌వేర్ మహిమ సారూ. కాదంటే డిఐజీ ప్రభావం' అంతలోనే వివరణా ఇచ్చాడు. 'అదే డబుల్ ఇన్‌కమ్‌గ్రూప్' నవ్వాడు. 'శేఖరంగారూ ఆ కేటగిరీవే. వాళ్ళావిడ హెచ్‌ఏయల్‌లో ఆఫీసరు' పూర్తి చేశాడు. ఫణిరాజ్ మాటలో అలతి హాస్యం వుంటుంది.

వేదికమీది సింహాసనాల్లోని వెంకట్, చంద్రకళా లేచి, నిలబడ్డారు. అతిథుల 'క్యూ' మొదలైంది. చేతుల్లో బహుమతులూ, తెల్ల కవర్లూ, బొకేలూ!

విశ్వం అందుకున్నాడు. 'ప్రజలంతా వరదలతో, ఈతిబాధలతో, అధిక ధరలతో ఛస్తున్నారు. ఇక్కడ ఇదీ వరస, ఆడంబరాలూ,అతిశయాలూ, డబ్బుని ఏం చేయాలో తెలీని సమస్య'.

విశ్వం ప్రసంగానికి ఆ కుర్చీలోని వ్యక్తి అడ్డు తగిలేడు. 'అక్కడ చూడండి. ఎవరో పొలిటీషియన్. ఆయన పరివారం. గవర్నమెంటా మజాకా, ఆఫీసర్లూ వాళ్ళూ చేతిలో చెయ్యేసుకు పోయేవాళ్లే. కోట్లల్లో ప్రజాధనాన్ని ఊదిపారేస్తున్నారు'. కసి చెలరేగబోయి ఆగిపోయింది.

విశ్వంలోని మార్క్స్ ఆత్మ ఎగిరి నిలబడింది. రాజకీయాల్ని తలచకుంటే కడుపు రగిలిపోతోంది. మనలాంటి జనం సంగతీ, దేశం సంగతీ ఎవరికి పట్టింది మాష్టారూ?'

'నువ్ దొంగంటే నువ్ దొంగవు కావా అని దెపుపకు ఛస్తున్నారు'.

"ఒక కుష్టురోగిని చూసి ఇంకో కుష్టురోగి వెక్కిరించినట్టే ఫణిరాజ్".

నేనూ సన్నగా నవ్వాను. వాళ్ళు ముగ్గురూ పెద్దగానే నవ్వారు.

కొద్దిసేపు మౌనం వహించాం అందరమూ.

ఫణిరాజ్ పక్క కుర్చీలో మాకు తెలియని వ్యక్తి ఎవరో కూచుని వున్నాడు. ఆయన యధాలాపంగా అన్నాడు, 'మీ లీసికి బిజినెస్ మస్ట్ నీ కలపాలండీ' అని. ముక్తసరిగా అని మెడని కొంగలా అటూ ఇటూ సాచి, కుర్చీలో సర్దుక్కూచున్నాడు.

ఫణిరాజ్ ఠక్కున కొస అందుకున్నాడు. 'అవునవును. యూ ఆర్ కరెక్ట్ సర్. ఇవ్వాళా రేపూ బండిమీద ఇడ్లీ దోశా కూడా లక్షలిస్తోంది. మా అపార్ట్‌మెంట్ ముందు మొగుడూ పెళ్ళాం పల్లెనుంచీ కట్టు బట్టల్తో వచ్చారు. ఈ బిజినెస్‌లోకి దిగారు. నాలుగేళ్ళల్లో మా కాంప్లెక్స్‌లోనే అపార్ట్‌మెంట్ లాగించేశారు. వాళ్ళ ఇద్దరు పిల్లలూ ఇవ్వాళ పబ్లిక్‌స్కూల్ స్టూడెంట్స్. ఈ మధ్య వాళ్ళు నాలాంటి వాళ్ళతో గుంభనంగా చెప్తున్నారు– 'డబ్బు ప్రాబ్లమ్‌గా వుందండీ. మీకు తెలిసినవాళ్ళ కెవరికన్నా అప్పు కావాలంటే చెప్పండి సారూ. సర్దుబాటు చేద్దాం - ఏదో రేటుకి' అని. మనమేమో ప్రతి వ్యాపారస్తుడి ఎక్స్‌ప్లాయిటేషన్‌కీ గురవుతూ కుళ్ళిపోతున్నాం. బతుకంతా ప్రతి నెలాఖరుకూ ఖాళీజేబుల్తో బుర్ర గీక్కొంటున్నాం. జుట్టు పీక్కుంటున్నాం.'

ఇదంతా పెద్దగా చెబుతున్నా ఫణిరాజ్‌కేసి పరీక్షగా చూస్తూ వెనకా ముందూ గమనించాను– మా మాటల్ని ఎవరైనా ఆలకిస్తున్నారా అని ముందువైపు ఎవరూ లేరు. వెనుక వరుసలో మాత్రం - నాకుర్చీ వెనక సీట్లో ఒక్క మనిషి మాత్రమే ఉన్నాడు.

నా చూపుల్ని తప్పించుకునేందుకు, వేదికని చూస్తున్నట్టు తన దృష్టిని పక్కకి మరల్చాడు.

అక్కడ క్యూ కదులుతోంది.

వీడియోకెక్కి సాక్ష్యమిచ్చుకునేవారు ఆగుతున్నారు. ఫోటోలతో క్లిక్ మనిపించుకునే వారూ, పట్టుచీరెలవారూ, పంజాబీడ్రెస్సులవారూ, పిల్లా, పెద్దా... ఆగి... ఆగి... కదుల్తున్నారు.

కొండ చిలువలా వంకరలుగా, చుట్టలు చుట్టలుగా సాగుతోంది క్యూ.

'ఓ పని అయిపోయింది బాబూ' అనుకున్న వారంతా అటునుంచీ అటే కుడివైపు డోర్‌లనుండీ డిన్నర్ ప్లేస్‌కి ప్రవేశిస్తున్నారు.

విశ్వం తన సీట్లో కొంచెం సర్దుకుని నన్ను ఉద్దేశించి అన్నాడు, 'మీకో రహస్యం చెప్తా వినండి - బిజినెస్ మహత్యం అర్థమవుతుంది. మా విజయవాడలో నూకరాజని వుండేవాడు. కాశీ తువ్వాళ్ళూ లుంగీలు, చీరెలూ, పంచెలూ సైకిల్ మీద వేసుకుని, వీధి వీధికీ తిరిగి అమ్ముకునేవాడట. ఆ తర్వాత పెద్ద షోరూమ్ పెట్టేశాడు. పదేళ్ళలో ఎంత సంపాదించాడో ఆయనకే తెలీదనుకునేవాళ్ళు జనం. ఆయన కట్టే సేల్స్ టాక్స్‌లో మనలాంటి పదిమంది బచ్చాగుమాస్తాగాళ్ళు బతకొచ్చని జోక్ వేసుకునేవాళ్ళం. అదీ వ్యాపారంలో మజా. పెద్ద పెద్ద బిజినెస్ మేగ్నెట్స్ కథలన్నీ అంతే.

క్షణం సేపు అనేక ఆలోచనలు ముసురుకున్నై బుర్రల్ని.

విశ్వమే అన్నాడు మళ్ళీ. 'వాళ్ళ రాబడంతా దోపిడీకిందే లెక్క. వాళ్ళ పోగేసేదంతా నిజానికి మనలాంటి వాళ్ళ డబ్బే. అందుకనే కొంతమంది వీళ్ళకి అప్పు లెగ్గొట్తారు. అదే సామాజిక న్యాయం'

విశ్వం కంఠస్వరంలోకి మళ్ళీ సిద్ధాంత కర్తలొచ్చేస్తున్నారు. ఉద్రేకం తొణకబోతోంది, నేను కొంచెం ఇబ్బందిగానే ఫీలయ్యాను. అతని చేతిని తట్టాను. విశ్వం మాట్లాడటం ఆపాడు.

నేను వెనక్కి తిరిగి నా వెనకనున్న మనిషిని గమనించాను.

ఈసారి అతను చూపు మరల్చుకోలేదు. నా కళ్ళల్లోకి చూస్తూ సన్నగా నవ్వాడు.

నేను గంభీరంగా పక్కచూపులు చూశాను.

అంతలోనే ఎవరో పెద్దాయన మాకు ఎడమవైపు వరసల దగ్గరకి వచ్చి ఆగేడు. కొంతమంది లేచి నిలబడి ఆయనకి విష్ చేశారు. వాళ్ళని పరామర్శిస్తూ, చేతులు కలుపుతూ నవ్వు మొహంతో ఆయన అక్కడున్న వారందర్నీ వుద్దేశించి. 'అంతా డిన్నర్ చేసి వెళ్ళండి ప్లీజ్' అని అభ్యర్థించాడు.

అందరి తలలే 'అలాగే' అన్నట్టు ఊగినై.

ఆ పెద్దాయన అడుగులు కదల్చి మా ముందుకొచ్చాడు.

నేనూ, ఫణిరాజ్, విశ్వం నిలబడి పరిచయం చేసుకున్నాం.

ఫణిరాజ్ పక్కకుర్చీలో వున్న వ్యక్తీ నిలబడి, 'నేను పెళ్ళికొడుకు తల్లి వైపు వాణ్ణి' అని చుట్టరికం చెప్పుకున్నాడు.

నా వెనుక కుర్చీలో అతను కూడా లేచి నిలబడ్డాడు.

పెద్దాయన అతనికేసి చూస్తూ, చాలా సౌమ్యంగా 'నమస్కారం' అన్నాడు.

అతనూ ప్రతి నమస్కారం చేశాడు. మర్యాద ఉట్టిపడే కంఠ స్వరంతో పరిచయం చేసుకున్నాడు. 'నా పేరు గిరిరాజండి. మాది విజయవాడ, సదానందం గారికీ మా నాన్నగారికీ బాగా స్నేహమండి'.

ఇంతలో ఎవరో పెద్దాయన పక్కకొచ్చి నిలబడ్డారు. ఆయన 'సంతోషం' అని 'అందరూ డిన్నర్ చేసి వెళ్ళండి' అంటూ చేయి ఊపుతూ వెళ్ళిపోయాడు.

గిరిరాజు మా వైపు చూస్తూ 'మా నాన్న గారి పేరు నూకరాజండి' అన్నాడు.

నేనూ, విశ్వం, ఫణిరాజ్ అవాక్కయ్యాం. మొహామొహాలు చూసుకున్నాం!

విశ్వంకయితే పచ్చివెలక్కాయ గొంతున పడినట్లయింది.

మా ఇబ్బందిని గమనించాడు గిరిరాజు.

పర్లేదులెండి. బిజినెస్‌లో వుండేవారికి ఇలాంటి మాటలు చెవుల్లో పడుతూనే వుంటై" అని తేలిగ్గా తీసుకుంటాం. అన్నట్టు, నేనూ ఇప్పుడు క్లాత్ బిజినెస్‌లోనే వున్నాను. కానీ, షోరూమ్‌ల్లో కాదు. సైకిల్‌మీద పొరుగూర్లకి వెళ్ళి బట్టలమ్ముకొస్తున్నాను'.

అప్రయత్నంగా 'అదేం?' అన్నాను.

'వ్యాపారంలో బొమ్మా బొరుసూ ఉంటై కదండీ. అప్పులకు సరుకు తీసుకున్న వాళ్ళందరూ నిజాయితీ పరులు కాదు గదండీ. అందులోనూ అట్టాంటి శాల్తీల్లో ఎక్కువమంది మధ్యతరగతి గుమాస్తాలేనండీ' అన్నాడు.

వ్యాపారంలో నష్టాలొచ్చి మా నాన్న పోయారండి' అనీ అన్నాడు.

మా ముగ్గురి మొహాల్లోనూ కత్తివాటుకి నెత్తురుచుక్క లేదు.

కాళ్ళమీద చీమలు పాకుతున్నట్లనిపించింది నాకు.

విశ్వమూ నేనూ కూడా విజయవాడలో కలిసి పనిచేశాము.

ఆ కాలంలో మా ఇద్దరికీ నూకరాజు క్లాత్ స్టోర్స్‌లో ఖాతా వుండేది.

'బదిలీల మీద పోయిన వాళ్ళ ఖాతాలన్నీ మమ్మల్ని ముంచేసినయ్యండీ' గిరిరాజు మాటల్లో ఇంకా ఇప్పటికీ నిలిచివున్న కసి తొణికిసలాడింది.

వెన్నున చరిచినట్లయింది.

దొంగకి తేలుకుట్టినట్లూ అయింది.

అయితే దొంగ ఎవరు?

ఏమో!

కొన్ని నిజాలు అస్సలు మింగుడు పడవు! ఎంత ప్రయత్నించినా

నా అడుగులు డిన్నర్ హాల్‌వైపు కదల్లేదు!!

–చినుకు మాసపత్రిక, ఫిబ్రవరి 2011